క్లుప్తంగా

ధాబాలు, టీ కేఫ్‌ల తనిఖీ


టీ కేఫ్‌లో తనిఖీ చేస్తున్న సీఐ, పోలీసులు

గుత్తి: గుత్తిలోని అనంతపురం రోడ్డు, తాడిపత్రి రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లోని ధాబాలు, టీ కేఫ్‌లు, హోటళ్లను పోలీసులు ఆదివారం రాత్రి విస్తృతంగా తనిఖీలు చేశారు. సీఐ రామారావు, ఎస్‌ఐ సురేష్, ఏఎస్‌ఐ నాగమాణిక్యం తమసిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దుకాణాల్లో క్యారమ్స్ బోర్డులు, ఆన్‌లైన్ గేమ్స్ ఆడకూడదన్నారు. రాత్రి పది గంటల కల్లా హోటళ్లు, ధాబాలు, టీ కేఫ్‌లు మూసి వేయాలన్నారు. రాత్రి పది గంటల తర్వాత తెరిచి ఉంచితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేరుశనగలో పంట కోత ప్రయోగాలు


కల్లూరులో పంట కోత ప్రయోగం చేస్తున్న అధికారులు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో సోమవారం గణాంక అధికారులు వేరుశనగలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. జిల్లా గణాంక అధికారి గిరిధర్ పర్యవేక్షణలో రైతు శ్రీనాథ్ పొలంలో పంట కోత ప్రయోగాలు చేశారు. మొదటి ప్రయోగంలో 3.620 కిలోలు, రెండో ప్రయోగంలో 4.850 కిలోలు దిగుబడి వచ్చిందని మండల సహాయ గణాంక అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ సహాయకురాలు శ్రీజ, వీఆర్‌ఏ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం


ఆలయకమిటీ సభ్యులతో మాట్లాడుతున్న తలారి రంగయ్య

పెద్దవడుగూరు: మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సోమవారం మాజీ ఎంపీ తలారి రంగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో ప్రారంభోత్సవం సందర్భంగా గణపతి పూజ, గంగ పూజ, యాగశాల ప్రవేశం, ప్రధాన కలశ స్థాపన, అఖండదీపారాధన, మంగళహారతి, తీర్థప్రసాదాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు.

సాఫ్ట్ టెన్నిస్ క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: అంతర్జాతీయ సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో రాణించిన విద్యార్థులకు సోమవారం పట్టణంలోని శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో అభినందన సభను ఏర్పాటు చేశారు. కళాశాలకు చెందిన బీబీఏ విద్యార్థి అరోనా రోనాల్డియన్ పోలాండ్, దక్షిణ కొరియా, చైనా దేశాల్లో నిర్వహించిన అంతర్జాతీయ సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో రాణించి బంగారు పతకం సాధించాడు. ఇక బీసీఏ చెందిన మరో విద్యార్థి భాను ప్రకాష్ సిల్వర్ మెడల్ సాధించడంతో సోమవారం ఇద్దరినీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కోచ్ శేఖర్, పీడీ మహబుబ్‌బాషా, అధ్యాపకులు బసెట్టి క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు వాల్మీకి జయంతి

పామిడి: పామిడిలో వాల్మీకి మండల సమైక్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎంఎస్ ఈశ్వరయ్య సోమవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకూ వాల్మీకి మహర్షి విగ్రహానికి మహా పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం వాల్మీకి మహర్షి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తామన్నారు. మండలంలోని వాల్మీకులు పెద్దెత్తున పాల్గొని మహర్షి అనుగ్రహం పొందాలని ఆయన కోరారు.

అన్నదానం

పుట్లూరు: మండలకేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దాతల సహకారంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నారు. కార్యక్రమంలో దాతలు శ్రీనివాసులరెడ్డి , ఆర్.ఓబుళేషు, సుబ్బయ్య, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌ల పాలన ఇంకెన్నాళ్లు!

- నాలుగు నెలలుగా తహసీల్దార్ లేక ప్రజల అవస్థలు
- ఎస్‌ఐ, పశువైద్యాధికారి, ట్రాన్స్‌కో ఏఈలంతా ఇన్‌చార్జ్‌లే..
- సకాలంలో పనులు పూర్తికాక ఇబ్బందుల్లో మండలవాసులు



పుట్లూరులోని తహసీల్దార్ కార్యాలయం

పుట్లూరు: మండలంలో ఇన్‌చార్జ్ అధికారుల పాలన సాగుతోంది. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పనులు సకాలంలో పూర్తికాకపోవడంతో రైతులు, విద్యార్థులకు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇన్‌చార్జ్ అధికారుల వల్ల మండలంలోని ప్రజలు అవస్థలు పడుతున్నారు. తహసీల్దార్, ట్రాన్స్‌కో, పశు వైద్యశాల, పోలీస్‌స్టేషన్ తదితర ప్రధాన కార్యాలయాల్లో ఈ పరిస్థితి ఏర్పడటం ఇప్పటి వరకు ఎన్నడూ చూడలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గత మూడు నెలలుగా ఈ పరిస్థితి ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం గమనార్హం.

నాలుగు నెలల క్రితం తహసీల్దార్ బదిలీ

పుట్లూరు తహసీల్దార్ శేషారెడ్డి నాలుగు నెలల క్రితం శింగనమల తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తహసీల్దార్‌గా రావడానికి ఎవరూ మక్కువ చూపకపోవడంతో శింగనమల తహసీల్దార్‌గా ఉన్న ఆయనకే పుట్లూరు అదనపు బాధ్యతలు ఇచ్చారు. దీంతో రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారంలో ఒకటి రెండు రోజులు వస్తున్నప్పటికీ భూ సమస్యలతో పాటు ఇతర సేవల్లో జాప్యం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోంది.

ఏఈ లేకపోవడంతో..

పుట్లూరుకు ట్రాన్స్‌కో ఏఈ లేకపోవడంతో విద్యుత్ సరఫరా, సేవల కోసం రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక్కడ రెగ్యులర్ ఏఈ లేకపోవడంతో మూడు నెలల క్రితం ఏడీ వసంతయ్య ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్స్ కోసం, విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాల పరిష్కారం కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. రెగ్యులర్ ఏఈని నియమిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

పాడి రైతుల అవస్థలు

పుట్లూరు పశువైద్యశాలలో పశువైద్యాధికారిగా ఉన్న నాగసువర్ణ పెద్దపప్పూరు మండలానికి బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఇప్పటి వరకు పుట్లూరు మండలానికి ఎవరూ నియామకం కాలేదు. మండలవ్యాప్తంగా పశువైద్యశాల మండలకేంద్రంలో మాత్రమే ఉండటంతో పాడి రైతులు, గొర్రెల కాపరులు ఈ వైద్యశాలపై ఆధారపడి పశుపోషణ సాగిస్తున్నారు. అలాంటి పశువైద్యశాలకు వైద్యులను నియమించడంలో అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. పుట్లూరు మండలానికి పశువైద్యాధికారిగా రావడానికి ఎవరూ ఇష్టపడలేదని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నట్లు సమాచారం.

శాంతి భద్రతలకు విఘాతం

పుట్లూరు మండలంలో సమస్యాత్మక గ్రామాలు అనేకం ఉన్నాయి. తాడిపత్రి నియోజవకర్గానికి దగ్గరగా ఉండటం వల్ల అక్కడి రాజకీయ పరిస్థితులు పుట్లూరు మండలంపై ప్రభావం అధికం. ఇలాంటి మండలంలో రెగ్యులర్ ఎస్‌ఐ లేకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. పుట్లూరులో సర్కిల్ కార్యాలయం ఉండటంతో సీఐ పర్యవేక్షణలో ట్రైనీ ఎస్‌ఐ ఉన్నప్పటికీ రెగ్యులర్ ఎస్‌ఐ లేకపోవడంతో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నాతాధికారులు స్పందించి పుట్లూరు మండలానికి రెగ్యులర్ అధికారులను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిరవధిక సమ్మె జయప్రదం చేయండి


గుంతకల్లులో పోస్టర్లు విడుదల చేస్తున్న విద్యుత్ జేఏసీ నాయకులు


గుత్తిలో డీఈఈకి సమ్మె నోటీసు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్/గుత్తి: విద్యుత్ ఉద్యోగ, కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 15 నుంచి చేపట్టబోయే నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని స్థానిక జేఏసీ అధ్యక్షుడు రామ్ ప్రసాద్, నాయకులు షాషావలి, మైనుద్దీన్ కోరారు. సోమవారం గుంతకల్లులోని విద్యుత్ నిలయం ఎదుట నిరవధిక సమ్మెకు సంబంధించిన పోస్టర్లను వారు విడుదల చేశారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, గ్రేడ్-2 జేఎల్‌ఎంలకు పదోన్నతి కల్పించాలని, మెడికల్ అలవెన్సు సౌకర్యం కల్పించాలని ఏడీఈ నాగేంద్రను కలిసి విన్నవించారు. డిమాండ్ల సాధన కోసంఈ నెల 8న తిరుపతి ఎస్పీడీసీఎల్ ఎదురుగా ధర్నా, 15 నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొనాలని వారు కోరారు. అలాగే గుత్తి ఏపీఎస్పీడీసీఎల్ డివిజనల్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు సోమవారం డీఈఈ పద్మనాభ పిళ్లెక్కు సమ్మె నోటీసు అందజేశారు. సోమవారం నుంచి నిరవధిక సమ్మెలో వెళ్లనున్నట్లు సమ్మె నోటీసులో పేర్కొన్నారు. జేఏసీ నాయకులు రమణ, రాంప్రసాద్, షాషావలి, నాగేంద్ర ప్రసాద్, విన్సెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీష్

గుంతకల్లు: ఉమ్మడి అనంతపురం జిల్లాలకు వరంగా మారిన ఆర్డీటీ సేవలను అడ్డుకోవడం దారుణమని, ఆర్డీటీ సేవలను పునరుద్ధరించపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ హెచ్చరించారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సేవలకు సమాంతరంగా ఆర్డీటీ అపన్నహస్తం అందిచిందన్నారు. దివ్యాంగులు, అనాథలకు ఆర్డీటీ ఆసరాగా నిలిచిందన్నారు. పేద విద్యార్థుల చదువు, క్రీడలు, మహిళల ఆర్థికాభివృద్ధికి సహకరించిందన్నారు. అయితే ఎన్డీఏ ప్రభుత్వం విదేశాల నుంచి వచ్చే నిధులను నిలిపివేయడంతో ఆర్డీటీ సేవలకు అంతరాయం కలిగిందన్నారు. ఈ నెల 9 లోగా ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్సను పునరుద్ధరించకపోతే ఈ నెల 10 నుంచి మున్సిపల్ కార్యాలయం వద్ద సామూహిక దీక్షలు చేపడతామన్నారు. ఈ నెల 18న ప్రజా ప్రదర్శన నిర్వహించి, కేంద్ర హోంశాఖకు నిరసన తెలియజేస్తామన్నారు. ఆర్డీటీ కోసం నిర్వహించే ఆందోళన కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బి.గోవిందు, మహేష్, గోపీనాథ్, గౌస్, రాము, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్లకు వ్యతిరేకంగా తీర్మానం చేయండి


చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న క్షౌరవృత్తిదారుల సంఘం నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఇతర మతాలు, కులాలకు చెందిన వారు కార్పొరేట్ సెలూన్‌షాపుల ఏర్పాటుకు అనుమతి లేదని మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానిని క్షౌ రవృత్తిదారుల సంఘం నాయకులు కోరారు. సోమవారం ఆమెను చాంబర్‌లో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్పొరేట్ సెలూన్‌షాపుల వల్ల కులవృత్తిపై ఆధారపడిన నాయీ బ్రాహ్మణ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి సూరి, కోశాధికారి బ్రహ్మ వాపోయారు. కార్పొరేట్ సెలూన్లకు మున్సిపాలిటీ తరఫున అనుమతి ఇవ్వొద్దని వారు విన్నవించారు. కార్యక్రమంలో క్షౌ రవృత్తిదారుల సంఘం నాయకులు శంకర్, నీలాకుమార్, నరేష్, అజయ్, అంజి, సాయి, వాసు, బాల, సురేంద్ర, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గుదలపై అవగాహన

యాడికి/గుత్తిరూరల్/పెద్దపప్పూరు: కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీ స్లాబ్‌ల కారణంగా తగ్గిన వస్తువుల దరలు, ప్రజలకు చేకూరుతున్న లబ్ధిపై సోమవారం యాడికి మండలంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి వెలుగు కార్యాలయం వరకూ అధికారులు ర్యాలీ నిర్వహించారు. వెలుగు కార్యాలయం లో పొదుపు మహిళలకు జీఎస్టీ తగ్గుదలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శశికళ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగేశ్వరరెడ్డి, ఏపీఓ మద్దిలేటి, ఏపీఎం చంద్రశేఖర్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గుత్తి తహసీల్దార్ కార్యాలయంలో జీఎస్టీ తగ్గించడం ద్వారా ధర తగ్గిన వస్తువుల వివరాలను మండల స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుణ్యవతి, వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఏపీఓ రమేష్, ఏపీఎం అరుణకుమారి, టీఏ, ఎఫ్ఏ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దపప్పూరు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జీఎస్టీ తగ్గింపుపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ అమర్‌నాథరెడ్డి హాజరై జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్, ప్రిన్సిపాల్ శంకర్‌ప్రసాద్, ఎంఈఓ రవికుమార్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలి


ఆర్‌డీఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: మెడికల్ కళాశాల నిర్మాణాలను పీపీపీ పద్ధతిలో కాకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే చేపట్టాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను పీపీపీ పద్ధతిలో నిర్మాణాల ఒప్పందాలను ఉపసంహరించుకోవాలంటూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దాదాపు రూ.8500 కోట్లు ఖర్చు చేసి 17 మెడికల్ కళాశాలల నిర్మాణాలు చేపట్టిందన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తరువాత నిధులు లేవని సాకుతో 15 నెలలుగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాలు ఆపేసిందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి పీపీపీ పద్ధతికి స్వస్తి పలికాలన్నారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు రఘునాథ్‌రెడ్డి, జీలాన్, రామాంజినేయులు, రఘు, రామకృష్ణ, బాష, ఆశాబీ పాల్గొన్నారు.

‘స్వచ్ఛ అవార్డు’ల అందజేత


అవార్డు అందుకుంటున్న పుట్లూరు ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి


యాడికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శశికళ, సర్పంచు అనురాధ


పుసుపుల ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ హనుమంతరెడ్డి

పుట్లూరు/యాడికి/బుక్కరాయసముద్రం: అనంతపురంలో పలువురికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీపీఓ నాగార్జున సోమవారం స్వచ్ఛ అవార్డులు అందజేశారు. యాడికి ఆదర్శపాఠశాలకు వచ్చిన స్వచ్ఛ అవార్డును ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి అందుకున్నారు. అలాగే యాడికికి వచ్చిన స్వచ్ఛ అవార్డును సర్పంచు అనురాధ, డిప్యూటీ ఎంపీడీఓ శశికళ, ఇన్‌చార్జ్ పంచాయతీ ఈఓ శశికళ, వెలుగు ఏపీఎం చంద్రశేఖర్ అందుకున్నారు. అదేవిధంగా కత్తిమానుపల్లికి చెందిన సుంకులమ్మ విలేజ్ ఆర్గనైజేషన్ అవార్డుకు ఎంపికవగా ఆ సంస్థ ప్రతినిధులు అవార్డు స్వీకరించారు. అలాగే బుక్కరాయసముద్రం మండలంలోని సిద్దరాంపురంలో ఉన్న పసుపుల ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి స్వచ్ఛ అవార్డు లభించగా కంపెనీ డైరెక్టర్ హనుమంతరెడ్డి అవార్డు అందుకున్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

యల్లనూరు: ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుడి బంధువులు కోరారు. మండలంలోని బుక్కాపురానికి చెందిన తప్పెట జయ ప్రసాద్ అప్పుల బాధ తాళ లేక గత ఏడాది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మృతుడి భార్య తప్పెట లక్ష్మీదేవి, కుమారుడితో కలసి బంధువులు సోమవారం ఫిర్యాదుల విభాగంలో తహసీల్దారు రాముకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జయప్రసాద్ వ్యవసాయ పనులు, బోర్లు వేసేందుకు సుమారు రూ. 20లక్షలు దాకా అప్పులు చేశాడని, వాటిని తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతు కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని తహసీల్దారు తెలిపారు.

కాసులు కాంట్రాక్టర్‌కు.. కష్టం కార్మికులకా?



రోడ్డు మరమ్మతుల అనంతరం శిథిలాలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని గుంతబావి నుంచి సోఫియా స్ట్రీట్ వరకూ తాగునీటి మెయిన్ పైపులైన్ ఏర్పాటు కోసం ధ్వంసం చేసిన రోడ్ల మరమ్మతులు 10 రోజుల క్రితం పూర్తయ్యాయి. కొత్తగా నిర్మించిన రోడ్డు వాటర్ క్యూరింగ్‌లో భాగంగా నీటి నిల్వల కోసం మట్టితో కట్టిన గట్లు పూర్తిస్థాయిలో తొలగించి రోడ్లను నీటితో శుభ్రం చేయించాల్సిన కాంట్రాక్టర్ అటువైపు చూడలేదు. విపరీతమైన దుమ్ముధూళిని భరించలేక దుకాణదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఆ రోడ్డున వెళ్లే వాహన చోదకులు, పాదచారులు ముక్కుమూసుకుని వెళ్లేవారు. ఇంజినీరింగ్ అధికారులు కూడా కాంట్రాక్టర్ చేత రోడ్డును శుభ్రం చేయించకుండా చేతులెత్తేశారు. స్థానిక వ్యాపారుల విజ్ఞప్తి మేరకు సోమవారం మధ్యాహ్నం నలుగురు మహిళా పారిశుధ్య కార్మికులు కష్టపడి దుమ్ముధూళిని లెక్కచేయకుండా రోడ్లన్నీ ఊడ్చారు. కాసులేమో కాంట్రాక్టర్‌కు..కష్టమేమో పారిశుధ్య కార్మికులకా..అంటూ అక్కడివారు చర్చించుకున్నారు.

కేశవరెడ్డి స్కూల్‌లో దొంగల హల్‌చల్

బుక్కరాయసముద్రం: మండలంలోని వడియంపేట వద్ద ఉన్న కేశవరెడ్డి పాఠశాలలో దొంగలు రూ.2 లక్షలు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. సోమవారం తెల్లవారు జామున ముగ్గురు దొంగలు పాఠశాలలోకి ప్రవేశించి అకౌంట్స్ రూంలోని క్యాష్ బాక్స్‌ను ఎత్తుకెళ్లారు. పాఠశాల సమీపంలో ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.2 లక్షలు చోరీ చేశారు. ఈ ఘటన సీసీ కెమెరాల్లో రికార్డయింది. పాఠశాల సిబ్బంది ఫిర్యాదు మేరకు సీఐ పుల్లయ్య కేసు నమెదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అగాపే ఆశ్రమానికి ఫ్రిడ్జ్ వితరణ

యాడికి: మండల కేంద్రంలోని కమలపాడు రహదారిలో ఉన్న అగాపే వృద్ధాశ్రమానికి దాతలు రూ.35వేలు విలువ చేసే ఫ్రిడ్జ్ అందజేశారని నిర్వాహకుడు ప్రసాద్ సోమవారం తెలిపారు. దాతలకు ఆయనతోపాటు ఆశ్రమంలోని వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధుడి మృతి

గుత్తి రూరల్: మండలంలోని లచ్చానుపల్లిలో వడ్డే రామాంజనేయులు అనే వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామాంజనేయులు గొర్రెలు పెంపకంతో జీవనం సాగించేవాడు. ఇటీవల ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు ఈ నెల 4న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని గుత్తి ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం రాత్రి అతడు మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని కాల్వగడ్డ వీధిలో గత నెల 24న సుల్తాన్‌పై దాడి చేసిన ఘటనలో రహంతుల్లా, ఖాజాను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆరోహణరావు తెలిపారు.

వ్యక్తి మృతి

పామిడి: స్థానిక పామిడమ్మ వీధివాసి, ఇటుకల బట్టీ నిర్వాహకుడు బోయ వెంకటేష్(45) కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందినట్లు సీఐ వీ యుగంధర్ సోమవారం తెలిపారు. వివరాలు..గత నెల 16న మండలంలోని వంకరాజుకాలువ గ్రామం వద్ద జరిగిన ద్విచక్ర వాహన రోడ్డు ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి కర్నూలులో చికిత్స పొందుతున్న ఆయన మృత్యుఒడికి చేరాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలున్నారు. సీఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

యల్లనూరు: మండలంలోని రౌడీషీటర్లను సోమవారం ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్‌ఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు గొడవలను ప్రోత్సహించినా, ప్రేరేపించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో సమస్యలు సృష్టించొద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నారాయణరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శంకర్‌నారాయణ, పోలీసు సిబ్బంది నవీన్, ఆదిరెడ్డి, రవీంద్రారెడ్డి, రామ్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

‘యూరియా కొరత రానీయొద్దు’

శింగనమల: రైతులకు సకాలంలో యూరియా అందుబాటులో లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. యూరియా, జిప్సం, రసాయనిక మందులు సబ్సిడీపై రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. మండలంలో రీ సర్వే చేసిన గ్రామాల్లో ఆన్‌లైన్‌లో 1బీ, అడంగల్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, కొండారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

యాడికి: మండల కేంద్రంలో చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద సోమవారం కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కర్నూలు జిల్లాకు చెందిన శాంతి రామ్ కంటి ఆసుపత్రి యాజమాన్యం కంటి వైద్య శిబిరం నిర్వహించింది. శిబిరానికి 30 మంది హాజరు కాగా 20 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికైనట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

‘అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి’

శింగనమల: నార్పల ప్రధాన కూడలిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నార్పల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు రామాంజినేయులు మాట్లాడుతూ నార్పల నడిబొడ్డులో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు 20 ఏళ్ల కిందట స్థలం కేటాయించారని, ఇప్పటికీ విగ్రహం ఏర్పాటు చేయలేదన్నారు. అధికారులు స్పందించి విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు హనుమంతు, రామచంద్ర, ప్రసాద్, నారాయణ పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

యాడికి: పోక్సో కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలను సోమవారం వెల్లడించారు. యాడికి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన బత్తుల కృష్ణారెడ్డి అత్యాచారయత్నానికి పాల్పడినట్లుగా బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై శనివారం పోక్సో కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం వేములపాడు గ్రామ సమీపంలో ఉన్న బత్తుల కృష్ణారెడ్డిని సీఐ ఈరన్న గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో సోమవారం ద్విచక్రవాహనం బోల్తా పడి కల్యాణ్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఊబిచెర్లకు చెందిన కల్యాణ్ పని నిమిత్తం గుత్తి వచ్చాడు. తిరిగి బైక్‌లో గ్రామానికి వెళ్తుండగా కరిడికొండ గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై రాయల్ డాబా ఎదురుగా బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.